క్లుప్తంగా

పోడు భూములకు పట్టాలివ్వాలి



డీటీ గణపతిరావుకు వినతి పత్రం అందిస్తున్న దృశ్యం

మాడుగుల : పోడు ఫారెస్టు భూములకు పట్టాలివ్వాలంటూ సీపీఎం మండల కార్యదర్శి ఇరట నరసింహమూర్తి ఆధ్వర్యంలో గిరి రైతులు జాలంపల్లి పంచాయతీ పెద పిట్టగెడ్డలో ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సులో గురువారం డిప్యూటీ తహసీల్దార్ గణపతిరావుకు వినతి పత్రం అందజేశారు. వారికి పట్టాలివ్వకపోవడం వల్ల ప్రభుత్వ పథకాలు అందడం లేదన్నారు.

ఆలయానికి జేగంట విరాళం



మోదమాంబ ఆలయంలో జేగంటను సర్పంచ్ సంజీవిరావుకు అందజేస్తున్న సత్తిబాబు దంపతులు

మాడుగుల రూరల్ : మండలంలో ఎం.కోడూరు మోదమాంబ ఆలయానికి జేగంటను దాతలు గురువారం సర్పంచ్ సంజీవిరావు, ప్రధాన అర్చకులు శ్రీనివాసశాస్త్రిలకు అందజేశారు. ఎం. కోడూరు గ్రామానికి చెందిన శివగంగా వాటర్ ప్లాంట్ అధినేత ఉగ్గిన సత్తిబాబు, ఆయన సోదరులు ఏసుబాబు, శివాజీ, కుటుంబ సభ్యులు సుమారు 9 కిలోల వెండితో రూ.10 వేల విలువ చేసే ఇత్తడి జేగంటను తయారు చేసి ఆలయానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు పడాల అప్పలనాయుడు, ఉగ్గిన ఏసు పాల్గొన్నారు.

గర్భిణుల్లో రక్తహీనత నివారించాలి



గొట్లాంలో ఆరోగ్య పరీక్షలను నిర్వహిస్తున్న హెచ్‌వీ భాగ్యలక్ష్మి

కె.కోటపాడు : గర్భిణులు ప్రధానంగా రక్తహీనత సమస్య బారిన పడకుండా ఉండేందుకు వైద్య సిబ్బంది వివరించే ఆరోగ్య జాగ్రత్తలను పాటించాలని లంకవానిపాలెం పీహెచ్‌సీ హెచ్‌వీ భాగ్యలక్ష్మి అన్నారు. గొట్లాం గ్రామంలో గురువారం ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్య పరీక్షలు జరిపారు. 132 మందికి సాధారణ వైద్యంతో పాటు ఉచితంగా మందులు ఇచ్చారు. 8 మంది గర్భిణులకు ఆరోగ్య తనిఖీలతో పాటు హెచ్.బీ పరీక్షలను చేశారు. ఐరన్ మాత్రలను వీరికి అందించారు. గర్భిణులు ఎక్కువగా పప్పు దినుసులు, ఆకుకూరలతో కూడిన ఆహారం తీసుకోవడం ద్వారా రక్తహీనత సమస్యను అధిగమించవచ్చునని హెచ్‌వీ భాగ్యలక్ష్మి అన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ భాగ్యలక్ష్మి, ఏఎన్ఎం అనురాధ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి



డిగ్రీ కాలేజీలో మొక్కలు నాటిన ఎమ్మెల్యే రాజు, విశాలాక్షి ఫౌండేషన్ ప్రతినిధులు

చోడవరం : పేద విద్యార్థులకు సాయం చేసేందుకు విశాలాక్షి ఫౌండేషన్ ముందుకు రావడం ఎంతో అభినందనీయమని ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్ రాజు అన్నారు. చోడవరం విశాలాక్షి ఫౌండేషన్ ఆధ్వర్యంలో చోడవరం ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఆవరణంలో గురువారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కాలేజీ ఆవరణలో 100 మొక్కలు నాటారు. కబడ్డీ క్రీడాకారులకు క్రీడా దుస్తులు అందజేశారు.

మహిళలకు నిత్యావసర సరుకుల పంపిణీ

నర్సీపట్నం: మున్సిపాలిటీ పెదబొడ్డేపల్లిలో రైతు సహకార సంస్థ ఆధ్వర్యంలో గురువారం మహిళలకు నిత్యవసర సరకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్పీకర్ సిహెచ్.అయ్యన్నపాత్రుడు పాల్గొని మహిళలకు సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల అభివృద్ధి కోసం ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందన్నారు.

ప్రారంభానికి సిద్ధంగా ఘాట్‌రోడ్, కింతలిరోడ్డు



కింతలి, ఘాట్‌రోడ్‌లో తారు రోడ్డు వేసిన దృశ్యం



కింతలి రోడ్డులో జంపెన వద్ద వెడల్పాటి సీసీ రోడ్డు నిర్మాణం జరిగిన దృశ్యం

- గత ప్రభుత్వ హయాంలో రూ.కోట్లు మంజూరు
- బూడి చొరవతో 50 గ్రామాలకు నెరవేరుతున్న కల
- ఎన్నికల ముందు తారురోడ్డు పనులు పూర్తి
- ప్రస్తుతం గ్రామాల వద్ద 1.80 కి.మీ డబుల్ సీసీ రోడ్లు పూర్తి

మాడుగుల : మండలంలో అత్యంత ప్రాధాన్యం ఉన్న, నిత్యం రద్దీగా ఉండే ఘాట్‌రోడ్, కింతలి రోడ్డు ఒకప్పుడు అధ్వానంగా ఉండేవి. మండల కేంద్రం రావడానికి ప్రధాన కీలకం ఈ రోడ్డు. ఈ రోడ్డు గోతులమయంగా ఉండడంతో సుమారు 50 గ్రామాల ప్రజలతో పాటు వాహన చోదకులు, నరకయాతన పడేవారు. ఈ రోడ్డుపై సుమారు 50 టన్నుల వరకు క్వారీ లారీలు ప్రయాణించడంతో రోడ్డు పెద్దపెద్ద గోతులు పడింది. వర్షం కురిస్తే గోతులతో ఆటోలు, ఇతర వాహనాలు దిగిపోయి అప్పుడప్పుడు ప్రమాదాలు కూడా జరిగేవి. దీంతో స్థానిక నాయకులు ఈ సమస్యను, గత ప్రభుత్వ హయాంలో అప్పటి డిప్యూటీ సీఎం, ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాల నాయుడు దృష్టికి తీసుకురావడంతో ఆయన తక్షణం స్పందించారు. రోడ్డును స్వయంగా పరిశీలించి క్వారీ లారీలు ప్రయాణించినా సరే పాడవకుండా రోడ్డు నిర్మాణం ఉండేలా 9.680 కి.మీ తారు రోడ్డుతో పాటు 1.80 కి.మీ సీసీ రోడ్డుకు సుమారు రూ.9 కోట్లు ఆర్అండ్‌బీ నిధులు మంజూరు చేయించారు. అప్పట్లోనే ఆగమేఘాల మీద అధికారులు తారురోడ్డు పనులు పూర్తి చేశా. తర్వాత ఎన్నికలు కోడ్ రావడంతో సీసీ రోడ్డు పనులు నిలిచిపోయాయి. ప్రస్తుతం సీసీ రోడ్లు కూడా పూర్తి కావడంతో సుమారు 50 గ్రామాల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. జంపెన, గాదిరాయి, వొమ్మలి చెరుకు కాటా, జేడీపేట, కింతలి గ్రామాల వద్ద డబుల్ సీసీ రోడ్డు 1.80 కి.మీ పూర్తి చేశారు. గతంలో జంపెన గాదిరాయి, గ్రామాల వద్ద డ్రైనేజీ నీరు రోడ్ల మీదకు రావడంతో గోతులతో మురుగుమయంగా ఉండేది. ఇపుడు సీసీ రోడ్లు కూడా పూర్తవడంతో ఏళ్ల నాటి సమస్య పరిష్కారం అయిందని ఆయా గ్రామాల ప్రజలతో పాటు వాహన చోదకులు మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

బూడికి రుణపడి ఉంటాం



గతంలో రోడ్డు బాగోక పోవడంతో మండల కేంద్రానికి వెళ్లలేక ఇబ్బందులు పడేవారం. గర్భిణులను ఆస్పత్రికి తీసుకెళ్లాలంటే ఇబ్బందులు తప్పేవికావు. 108 వాహనలు కూడా ఈ రోడ్డుపై సకాలంలో ఆసుపత్రికి చేర్చలేక ఇబ్బందులు పడేవారు. మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు చొరవతో రోడ్డుకు నిధులు మంజూరు కావడంతో బరువు వాహనాలు ప్రయాణించినా సరే చెక్కు చెదరకుండా రోడ్డు పనులు నాణ్యంగా నిర్మాణం జరిగింది. దాదాపు రోడ్డు పనులు పూర్తయ్యాయి. మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడుకు మండల ప్రజలు ప్రజలు రుణపడి ఉంటారు.

–తంటపురెడ్డి బన్నీ, లోవ వీరనారాయణం

మా కష్టాలు తీరాయి

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఘాట్‌రోడ్ కింతలి రోడ్డుకు నిధులు మంజూరవడంతో ప్రస్తుతం రోడ్డు పనులు పూర్తయ్యాయి. గతంలో రోడ్డు బాగోక మా తాతలు తండ్రుల నుంచి కూడా ఇబ్బందులు పడేవారు. రోడ్డు పూర్తి కావడంతో చాలా ఆనందంగా ఉంది. మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు కృషి వల్లే సుమారు 16 పంచాయతీలకు చెందిన ప్రజలు, రైతుల కష్టాలు తీరాయి.

–సలాది అచ్చింనాయుడు, గాదిరాయి

మరో రెండు రోజుల్లో పనులు పూర్తి

ఘాట్‌రోడ్, కింతలికి తారురోడ్డు నిర్మాణంతో పాటు సీసీ రోడ్లు కూడా పూర్తి కావడం జరిగింది. అయితే గ్రామాల దగ్గర ఎత్తుగా నాణ్యతగా డబుల్ సీసీ రోడ్డు పనులు కూడా పూర్తి చేశాం. మరో రెండు రోజుల్లో రోడ్డు పనులు పూర్తి చేసి అప్పగిస్తాం.

–సాయి శ్రీనివాస్, అర్అండ్‌బీ జేఈ , మాడుగుల

బాల్యవివాహాలు నిర్మూలించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో మూర్తి

నర్సీపట్నం: బాల్య వివాహాల కట్టడికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మాకవరపాలెం ఎంఈవో కె.ఎస్.ఎన్.మూర్తి పిలుపునిచ్చారు. మాకవరపాలెం మండలానికి సంబంధించి కిశోరి వికాసంపై శిక్షణను ఐసీడీఎస్ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాల నిరోధక చట్టాన్ని సమర్థంగా అమలు చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఇలాంటి వివాహాలతో మైనర్లు వారి జీవితాన్ని ఎంచుకొనే స్వేచ్ఛను కోల్పోతారని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించిందన్నారు. అనంతరం సీడీపీవో మేరీ సువార్త మాట్లాడుతూ బాల్య వివాహాలు ఎవరు ప్రోత్సహించినా శిక్షార్హులు అవుతారన్నారు. గ్రామాల్లోని నిరక్షరాస్యులకు ఈ విషయంపై సచివాలయ సిబ్బంది, ఏఎన్ఎంలు, మహిళా పోలీసులు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ అధికారులు లక్ష్మి, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి



మాట్లాడుతున్న నాతవరం పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రసన్న

నాతవరం: రక్తహీనత లేకుండా జాగ్రత్తలు పాటిస్తే రోగాలు చాలా వరకు రాకుండా ఉంటాయని నాతవరం పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రసన్న అన్నారు. మండల కేంద్రంలో గురువారం సచివాలయ వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. అధికంగా మహిళల్లో రక్తహీనత కారణంగా తరుచూ రోగాలు వస్తున్నాయన్నారు. విటమిన్లు ఉండే ఆహారం తీసుకోవాలని, అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్యకర్తలు, వైద్య సిబ్బంది సూచనలు పాటించాలన్నారు.

రైతులను మోసగించిన చంద్రబాబు

మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్ ధ్వజం



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే గణేష్

నర్సీపట్నం : రైతులను సీఎం చంద్రబాబు మరోసారి మోసం చేశారని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ అధినేత వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు ఈ నెల 13 కలెక్టరేట్ వద్ద అన్నదాతకు అండగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. గురువారం క్యాంపు కార్యాలయంలో దీనికి సంబంధించిన పోస్టర్లను పార్టీ నాయకులతో కలిసి గణేష్ ఆవిష్కరించారు. ఎన్నికలకు ముందు అనేక హామీలు ఇచ్చిన సీఎం చంద్రబాబు అధికారంలోకి వచ్చాక రైతులకు మొండి చేయి చూపారన్నారు. వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ఐదేళ్ల రైతు భరోసా పథకం ద్వారా ఏడాదికి రూ.13,500 చొప్పున రైతులకు అందించి రైతులను ఆదుకున్నారన్నారు. నేడు కూటమి ప్రభుత్వంలో పెట్టుబడి సాయం అందక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. రైతులకు అండగా నిలిచేందుకు వైఎస్సార్‌సీపీ ఉద్యమ బాట పట్టిందన్నారు. 2014 ఎన్నికల ముందు తెలుగుదేశం అధికారంలోకి వస్తే రైతు వ్యవసాయ రుణాలు మాఫీ చేస్తామని చెబితే చంద్రబాబును గెలిపించారన్నారు. తీరా అధికారంలోకి వచ్చిన తరువాత వ్యవసాయ రుణాలు కాదు పంట రుణాలని మాట మార్చారన్నారు. రైతులకు రూ.20 వేలు ఇస్తామని చెప్పిన చంద్రబాబు నేటికీ ఇవ్వలేదన్నారు. ప్రభుత్వ వైఖరికి నిరసనగా శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి పార్టీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు చింతకాయల సన్యాసిపాత్రుడు, రుత్తల యర్రాపాత్రుడు, ఎంపీపీలు సుర్ల రాజేశ్వరి, గజ్జలపు మణికుమారి, జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు, పార్టీ టౌన్ అధ్యక్షుడు ఏకా శివ, పార్టీ నాయకులు గణమ్మ, సుర్ల శేఖర్, శానపతి వెంకటరత్నం, రుత్తల సర్వేశ్వరరావు, బయపుడ్డి గణమ్మ, చోటీ, కణితి అన్నపూర్ణ, తమరాన శ్రీను పాల్గొన్నారు.

'అన్నదాతకు అండగా వైఎస్సార్‌సీపీ' ర్యాలీకి తరలిరండి



వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బాబూరావు

దేవరాపల్లి : రైతాంగాన్ని దగా చేస్తున్న టీడీపీ కూటమి ప్రభుత్వ తీరును నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ శుక్రవారం నిర్వహిస్తున్న 'అన్నదాతకు అండగా వైఎస్సార్‌సీపీ' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు బూరె బాబురావు పిలుపునిచ్చారు. దేవరాపల్లిలో గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాలనాయుడు నేతృత్వంలో రైతుల సమస్యలపై అనకాపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద శుక్రవారం రైతులతో ర్యాలీ, కలెక్టర్‌కు వినతి పత్రాలు అందజేసే కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి అన్ని గ్రామాల నుంచి రైతులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సహా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలని ఆయన కోరారు. ఉదయం 9 గంటలకు అనకాపల్లి రింగ్ రోడ్డులోని అనకాపల్లి నియోజకవర్గ ఇంచార్జ్ మలసాల భరత్ కుమార్ కార్యాలయం వద్దకు చేరుకోవాలని సూచించారు.

ఉచిత కంటి శిబిరం



సన్యాసిపాత్రుడు సమక్షంలో కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

నర్సీపట్నం :శంకర్ ఫౌండేషన్ వారి సహకారంతో లయన్స్ క్లబ్ వారు నర్సీపట్నం మండలం, వేములపూడి ఖాదీ ఆఫీసులో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, క్లబ్ మెంబర్ చింతకాయల సన్యాసిపాత్రుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్లబ్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. గ్రామీణ ప్రజలకు ఉచితంగా కంటి వైద్య సేవలను అందించాలనే సంకల్పంతో శిబిరం ఏర్పాటు చేశామన్నారు. కంటి సమస్యలతో శిబిరానికి వచ్చిన వంద మందికి పైగా రోగులకు ముగ్గురు వైద్యులు, పారామెడికల్ సిబ్బంది వైద్య సేవలు అందించారు. అపరేషన్ అవసరమైన వారికి శంకర్ ఫౌండేషన్‌కు ప్రత్యేక వాహనంలో తీసుకువెళ్లి ఉచితంగా కంటి అపరేషన్ చేస్తామని ఫౌండేషన్ వారు తెలిపారు. శస్త్ర చికిత్స జరిగిన ప్రతి వ్యక్తికి హాస్పిటల్లో వసతి, 30 రోజులకు సరిపడే మందు, కళ్లద్దాలు అందిస్తామని శిబిరం నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ నవ్య మెంబర్లు గొలుసు శ్రీనువాసరావు, చెరుకూరి ఇందిరా, చెరుకూరి సతీష్, చైతన్య, విజయ్, వెంకటేష్, కాశి, స్వరాజ్య సంఘం అధ్యక్షుడు ఐ.వి.రమణ పాల్గొన్నారు.

సత్యవరంలో ధాన్యం కొనుగోలు కేంద్రం



ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఏవో వాసుదేవరావు తదితరులు

మాడుగుల :మండలంలో సత్యవరం గ్రామంలో ప్రభుత్వం ద్వారా ధాన్యం కొనుగోలు కేంద్రం గురువారం ప్రారంభించడం జరిగిందని, వ్యవసాయాధికారి ఎం. వాసుదేవరావు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు ఎ.గ్రేడ్ ధాన్యం, క్వింటా రూ.2320, సాధారణ రకం రూ.2,300 కొనుగోలు చేస్తామన్నారు. ఆధార్ కార్డుతో పాటు ధాన్యం నమూనాను, రైతు సేవా కేంద్రానికి అందజేసి తేమ 17 శాతం కంటే తక్కువ ఉంటే ధాన్యం తీసుకుంటారన్నారు. అనంతరం రైతులు ప్రభుత్వంతో ఆమోదించబడిన తమకు నచ్చిన రైస్ మిల్లుకు ధాన్యం సరఫరా చేసుకోవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు తలారి అప్పారావు, సర్పంచ్ జెర్రిపోతుల రామారావు నాగమణి, ఉపసర్పంచ్ వొమ్మలి పెంయ్య, నాయకులు అద్దేపల్లి జగ్గారావు, వి.రాజుకుమార్, రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మాకవరపాలెం: మండలంలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్‌శాఖ డీఈ రామకృష్ణ తెలిపారు. మాకవరపాలెం, వెంకన్నపాలెం వద్ద ఉన్న 33 కెవి విద్యుత్ సభ స్టేషన్ల మరమ్మతుల్లో భాంగా సరఫరా నిలిపివేస్తామన్నారు. అన్ని ఫీడర్ల పరిధిలోనూ ఉదయం 7 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ నిలిపివేస్తామని, వినియోగదారులు ఈ విషయాన్ని గమనించాలని సూచించారు.

కె. కోటపాడు: ఎ. కోడూరు 11 కె.వి. సబ్‌స్టేషన్ పరిధిలో గల గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగుతుందని విద్యుత్ ఏఈ చంద్రశేఖర్ గురువారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. మెయింటెన్స్ పనులు, విద్యుత్ లైన్లకు అడ్డం వచ్చే చెట్ల కొమ్మల తొలగింపు నిమిత్తం ఎ.కోడూరు ఫీడర్ పరిధిలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎ.కోడూరు, పాడుగుపాలెం, సింగన్నదొరపాలెం, కొత్త అగ్రహారం, రామచంద్రపురం గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏఈ తెలిపారు.

సమన్వయంతో గ్రామాభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న ఎంపీపీ జయమ్మ

చీడికాడ: ప్రజాప్రతినిధులు, సచివాలయాల సిబ్బంది సమన్వయంతో గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని ఎంపీపీ కురచా జయమ్మ అన్నారు.గురువారం ఎంపీడీవో సమావేశ మందిరంలో ఆర్‌జీఎస్ఏ కార్యచరణ ప్రణాళిక 2024–25 ఎల్ఎస్‌డిజిఎస్ పై రెండురోజుల శిక్షణ తరగతుల ప్రారంభ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు.

అమ్మపేటలో వైద్య శిబిరం

గొలుగొండ: అమ్మపేట గ్రామంలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. సుమారుగా 36 మంది రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. వైద్యాధికారి శ్యామ్‌కుమార్ సూచనల మేరకు సీహెచ్‌వో ప్రసాద్ వైద్య శిబిరంను పరిశీలించి వైద్య సిబ్బందికి సూచనలు ఇచ్చారు.

స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలతో ప్రజలకు మేలు



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ ఎంపీడీవో అప్పలరాజు

కె.కోటపాడు : ప్రభుత్వ లక్ష్యాల మేరకు గ్రామాల్లో అభివృద్ధికి వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి ప్రజలకు అభివృద్ధిని అందుబాటులో ఉంచాల్సిన అవసరం ఉందని ఇన్‌చార్జ్ ఎంపీడీవో ఎస్.అప్పలరాజు అన్నారు. కె.కోటపాడు ఎంపీడీవో, వెలుగు కార్యాలయాల వద్ద గురువారం స్థిరమైన అభివృద్ధి లక్ష్యాల స్థానికీకరణ కార్యక్రమంపై సర్పంచ్, వివిధ శాఖల అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో అప్పలరాజు మాట్లాడుతు గ్రామాల్లో ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు వైద్య సిబ్బంది, సురక్షిత మంచినీటిని, పారిశుధ్య సమస్య లేకుండా చర్యలను చేపట్టడంలో ఆర్‌డబ్ల్యూఎస్, గ్రామంలో అభివృద్ధి పనుల ద్వారా మౌలిక వసతుల కల్పనకు పంచాయతీరాజ్, డ్వాక్రా సంఘాల ద్వారా మహిళా ఆర్థికాభివృద్ధి, ఐసీడీఎస్ ద్వారా గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు, ప్రీస్కూల్ చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్య, పౌష్టికాహారం ప్రభుత్వాలు అందించడం జరుగుతుందన్నారు. ఎల్ఎస్‌డీజీఎస్ గోల్స్ ద్వారా అందించే ప్రాధాన్యతాంశాలను సర్పంచ్‌లు, ఆయా శాఖల అధికారులు ప్రజలకు అందించే కార్యక్రమంలో పెద్దపీటను వేయాల్సిందిగా ఎంపీడీవో అప్పలరాజు సూచించారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ రమణి, మండల ఇంజనీర్ సుమతి, ఐకేపీ ఏపీఎం.చినబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఎస్‌డీజీఎస్ కార్యాచరణ ప్రణాళికపై శిక్షణ

మాడుగుల రూరల్ : మండలంలో సర్పంచ్‌లు, పంచాయితీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి రెండు రోజుల పాటు శిక్షణ కార్యక్రమం ఎంపీపీ కార్యాలయం సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్టు స్థానిక ఎంపీడీవో కె.అప్పారావు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆర్‌జీఎస్ఏ కార్యాచరణ ప్రణాళిక 2024–25 సంవత్సరానికి సంబంధించి ఎల్ఎస్‌డిజిఎస్ పై ఈ నెల 16, 17, తేదీల్లో ఎం.కోటపాడు, ఎం.కె.వల్లాపురం, సాగరం, డి.గొటివాడ, ముకుందపురం, వంటర్లపాలెం, తాటిపర్తి, వీరనారాయణం, జంపెన, సత్యవరం, జె.డి.పేట, గాదిరాయి, ఎల్.పొన్నవోలు, శంకరం, గ్రామాలకు చెందిన పంచాయతీ సర్పంచ్‌లు, కార్యదర్సులు, సచివాలయ సిబ్బంది, మండల స్థాయి అధికారులతో శిక్షణ జరుగుతుందన్నారు. 18, 19, తేదీల్లో ఎం.కోడూరు, కె.జె.పురం, వి.వి.అగ్రహారం, జి.అగ్రహారం, చింతలూరు, అవురువాడ, పొంగలిపాక, కింతలి, కె.వల్లాపురం, ఒమ్మలి, వీజేపురం, ఎం. కృష్ణాపురం, జాలంపల్లి, పి.పి. అగ్రహారం, మాడుగుల గ్రామాలకు చెందిన వారితో శిక్షణ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

నీటి సంఘాల ఎన్నికలకు ఏర్పాట్లు సిద్ధం



తహసీల్దార్ లక్ష్మీదేవి

దేవరాపల్లి : సాగు నీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలను జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ఈ నెల 14న ప్రశాంతంగా నిర్వహించేందుకు ఇరిగేషన్ అధికారులతో కలిసి ఏర్పాట్లు చేస్తున్నట్టు తహసీల్దార్ పి.లక్ష్మీదేవి తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో గురువారం ఆమె స్థానిక విలేఖర్లతో మాట్లాడారు. దేవరాపల్లి మండలంలో ఐదు మైనర్ నీటి సంఘాలు, నాలుగు మీడియం నీటి సంఘాలు ఉన్నాయన్నారు. మైనర్ నీటి సంఘాలకు ఆరుగురు డైరక్టర్లు, మీడియం సంఘాలకు 12 మంది డైరక్టర్ల(టీసీ మెంబర్లు)ను ఎన్నుకుంటారన్నారు. మైనర్ ఇరిగేషన్ పరిధిలో ముషిడిపల్లి మతలవాని చెరువు(226 ఓట్లు), నాగారాయుడు చెరువు(524 ఓట్లు), ఎ.కొత్తపల్లి రెడ్డివాని పెద్దివాని చెరువు(903 ఓట్లు), కెఎం.పాలెంలో వెంకయ్య చెరువు(441ఓట్లు), తెనుగుపూడిలో రాజు చెరువు(462 ఓట్లు) ఉన్నాయన్నారు. మీడియం పరిధిలో దేవరాపల్లి ఉయ్యాలచింత గెడ్డ(3662 ఓట్లు), ఎం.అలమండ కొత్త కాలువ(2647 ఓట్లు), వేచలం మహాపాత్రుని చెరువు(1500 ఓట్లు), కలిగొట్ల బ్రాంచ్ చానల్ (1947 ఓట్లు) ఉన్నాయన్నారు. 14న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం వరకు డైరెక్టర్ల ఎన్నిక జరుగుతుందని, మధ్యాహ్నం నుంచి అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు ఎన్నిక జరుగుతుందన్నారు.

'దివ్యాంగులకు రాయితీ కల్పించాలి'

మాడుగుల రూరల్ : ఆంధ్రప్రదేశ్ రోడ్డు రవాణా సంస్థ (ఆర్‌టీసీ) బస్సు సర్వీసులకు సంబంధించి, మెట్రో ఎక్స్‌ప్రెస్ సర్వీసుల్లో దివ్యాంగులకు రాయితీ కల్పించాలని దివ్యాంగులు ఆర్టీసీ ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు. గతంలో ఈ బస్సు సర్వీసుల్లో 50 శాతం రాయితీ ఉండేది. సుమారు ఎడాది కాలం నుంచి ఈ రాయితీని రద్దు చేశారని, ఈ బస్సు సర్వీసుల్లో దివ్యాంగులు పూర్తి స్థాయి టిక్కెట్టును కొనుగోలు చేసి ప్రయాణం చేయడం తప్పడం లేదని మండల దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు సుంకర శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆర్టీసీ పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్, లగ్జరీ తదితర సర్వీసులకు 50 శాతం రాయితీ కల్పిస్తున్న ఆర్టీసీ ఒక మెట్రో ఎక్స్‌ప్రెస్ సర్వీసులకు ఎందుకు అనుమతించడం లేదని ఆర్టీసీ అధికారులను ప్రశ్నిస్తున్నారు.

అన్నదాతకు అండగా కలసి రండి



మండల పార్టీ అధ్యక్షుడు రెడ్డి జగన్‌మోహన్

కె.కోటపాడు : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అన్నదాతలకు అండగా నిలవకపోవడంపై రైతన్నలకు అండగా ఉండి వారికి మేలు జరిగేందుకు అన్నదాతలకు అండగా వైఎస్సార్‌సీపీ కార్యక్రమాన్ని అనకాపల్లిలో శుక్రవారం నిర్వహిస్తున్నట్లు మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్ అన్నారు. కె.కోటపాడులో గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సూచనల మేరకు అనకాపల్లి పార్టీ వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, మాడుగుల వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈర్లె అనురాధ పిలుపు మేరకు అనకాపల్లిలో జరిగే ర్యాలీ, ధర్నా కార్యక్రమానికి మండలంలో అన్ని గ్రామాల్లో గల పార్టీ మద్దతుదారులైన సర్పంచ్, ఎంపీటీసీ, ముఖ్యనాయకులు హాజరుకావాలని ఎంపీపీ కోరారు. కె.కోటపాడుకు ఉదయం 8 గంటలకు చేరుకోవాలని సూచించారు. అక్కడ నుంచి అనకాపల్లిలో ర్యాలీ, ధర్నా కార్యక్రమానికి ఉదయం 10 గంటలకు చేరుకోవడం జరుగుతుందని తెలిపారు. రైతాంగ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వారికి న్యాయం జరిగేందుకు వైఎస్సార్‌సీపీ ఈ కార్యక్రమం చేపట్టిందన్నారు.